పాఠశాలల యాజమాన్యాలు
సేవా దృక్పథంతో పని చేయాలి


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సత్కరిస్తున్న క్యూఎంఆర్ఎస్ఎంఏ సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు లాభాపేక్షతో కాకుండా సేవా దృక్పథంతో పని చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (క్యూఎంఆర్ఎస్ఎంఏ) నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన రాజు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. సంఘం చైర్మన్ శివయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మేడ్చల్ జిల్లా కో ఆప్షన్ సభ్యులు వరప్రసాద్, నూతన అధ్యక్షుడు చింతల మహేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి సీహెచ్ గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు నందారెడ్డి, రాజులు, ఆర్ఎస్ చారి, శ్యామల్ రావు, రాజేష్, లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

◆ షాపూర్‌నగర్‌కు చెందిన శివశక్తి ధ్యాన యోగా మాస్టర్ పూర్ణ సాయి ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. జనవరిలో తమిళనాడులో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ యోగాసన లీగ్ సౌత్ జోన్ పోటీలకు తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ నిర్ణేతగా పూర్ణసాయి వ్యవహరించారు. చిన్న వయస్సులో ప్రగతి సాధించిన ఆయన్ని ఎమ్మెల్సీ అభినందించారు.

'లాక్రోజ్ క్రీడకు ఎంతో భవిష్యత్ ఉంది'



కుత్బుల్లాపూర్: సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో ఆదివారం తెలంగాణ లాక్రోజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మొదటి వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి షాపూర్‌నగర్‌కు చెందిన క్యాపిటల్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు పాల్గొని లాక్రోజ్ ఆట ప్రదర్శించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న మొదటితరం విద్యార్థులుగా రికార్డు నమోదు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ భువన మాట్లాడుతూ.. లాక్రోజ్ క్రీడకు ఎంతో భవిష్యత్ ఉందన్నారు. ఒలింపిక్స్‌లో సైతం ఈ క్రీడకు ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హేమలత మాట్లాడుతూ.. ఒలింపిక్స్‌లో గెలుపొందేలా తమ విద్యార్థులకు శిక్షణ ఇప్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లాథమ్ ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత, తెలంగాణ ఒలింపిక్ సంఘం ప్రెసిడెంట్ సముద్రాల వేణుగోపాలాచారి తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

రోడ్డు విస్తరణ కొనసాగుతూనే ఉంది..


దూలపల్లి రోడ్డులో తొలగించని విద్యుత్ స్తంభాలు

రోడ్డులో డ్రైనేజీ గుంత

సుభాష్‌నగర్: కొంపల్లి, బహదూర్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల దూలపల్లి నుంచి కొంపల్లి వరకు పనులు పూర్తయినా దూలపల్లి గ్రామంలో మాత్రం నత్త నడకన సాగుతున్నాయి. ముందస్తు ప్రణాళిక లేకుండా సంవత్సరాల తరబడి రోడ్డు పనులను చేయడంతో వాహనాదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూలపల్లి గ్రామంలో సుమారు అర కిలోమీటరు మేర రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, మంచినీటి పైపులైన్, భూగర్భ డ్రైనేజీ పైపులైన్ అలాగే వదిలేసి ప్రణాళిక లేకుండా రోడ్డు పనులు చేయడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. తాగునీటిలో డ్రైనేజీ నీళ్లు కలవడంతో ప్రజలు రోగాల భారీనా పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు రోడ్డు మీదకు ఉండటంతో రాత్రి వేళలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇలా సుమారు ఒక నెల నుంచి ఇలాగే పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ఎండ భయం.. గొడుగు పడతాం

సుభాష్‌నగర్: వేసవికాలం ప్రారంభంలోనే ఎండలు తారెత్తిస్తున్నాయి. ఉదయం 10 గంటలకే ఎండలు మండుతున్నాయి. బయటకు రావాలంటే గొడుగు సహాయంతో వస్తున్నారు. ఇక ముమ్మందు ఎండలు ఏ స్థాయిలో ఉంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



'బీజేపీ అత్యధిక సీట్లు కైవసం చేసుకుంటుంది'

- ఈటల రాజేందర్ సతీమణి జమున
- అపర్ణ పామ్‌గ్రోవ్‌లో మహిళా సంఘాలతో సమావేశం


ఈటల జమునకు కేక్ తినిపిస్తున్న బీజేపీ మహిళా నాయకులు

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అత్యధిక సీట్లు కైవసం చేసుకుంటుందని... నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిగా చూడాలంటే మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. ఆదివారం కొంపల్లిలోని అపర్ణ పామ్‌గ్రోవ్‌లో ఈటల రాజేందర్ సతీమణి జమున స్థానిక మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి, సెన్సార్‌బోర్డు మెంబర్ సరితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహిళల అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుపరుస్తోందన్నారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే ఈటల రాజేందర్‌ను గెలిపించుకుంటే స్థానికంగా మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. మోదీని ప్రధానిగా చేసే మహోద్యమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ వాసులు భాగస్వాములై వచ్చే ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి కౌన్సిలర్లు రాజిరెడ్డి, సూర్యకళ, అమరం మోహన్‌రెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి శివాజీ రాజు, జిల్లా ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ సతీష్, మహిళా మోర్చా సభ్యులు అమరం సరస్వతి, సంధ్యా, దుర్గ, భారతి, లక్ష్మీనరసమ్మ, శైలజ, విజయలక్ష్మి, నరసింహ, అశోక్, వివిధ కాలనీల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా విశాల్ టీమ్


విజేత జట్లకు పరుష కిషోర్‌యాదవ్ మెమోరియల్ ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

సుభాష్‌నగర్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పరుష కిషోర్‌యాదవ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన విశాల్ టీమ్ నిలిచింది. సూరారంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 34 జట్లు పోటీ పడగా ఫైనల్స్‌లో విశాల్ టీమ్ అనిల్ టీమ్‌పై విజయం సాధించింది. విన్నర్, రన్నరప్ జట్లకు శనివారం రాత్రి టోర్నమెంట్ నిర్వాహకులు ట్రోఫీని, బహుమతులు అందజేశారు.

భద్రతా చర్యల్లో భాగంగా వాహనాల తనిఖీలు


ప్రగతినగర్ కమాన్ సమీపంలో బాచుపల్లి-గండిమైసమ్మ రోడ్డులో తనిఖీలు చేపడుతున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది

నిజాంపేట్: బాచుపల్లి పోలీసులు, సీఐఎస్ఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిజాంపేట్ హనుమాన్ ఆలయం, ప్రగతినగర్ కమాన్ సమీపంలోని బాచుపల్లి-గండిమైసమ్మ చౌరస్తాకు వెళ్లే రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే వదిలిపెట్టారు. భద్రతా చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు బాచుపల్లి సీఐ పేర్కొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురి అరెస్టు


పందెం కోళ్లతో బెట్టింగ్‌లకు పాల్పడున్న వ్యక్తులు

కుత్బుల్లాపూర్: కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను మేడ్చల్ ఎస్ఓటీ టీమ్ సభ్యులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరయాంజాల్ గ్రామంలోని ఓ ఇంట్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారని ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం గ్రామంలోని తోట శ్రీనివాస్ ఇంటిపై దాడులు నిర్వహించి మూడు పందెం కోళ్లు, రూ.18,410 నగదు, 20 కోడి కత్తులు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్న తోట శ్రీనివాస్(58), సూర్యకాంతి భానుప్రకాష్‌రెడ్డి(25), భూపతి రాజగోపాల్ కృష్ణ(52), నడింపల్లి ప్రవీణ్ వర్మ(28) లను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం పేట్‌బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు.

వెంకటరాయనగర్ కాలనీ అధ్యక్షుడిగా రవీంద్రరెడ్డి



నిజాంపేట్: నిజాంపేట్ వెంకటరాయనగర్ కాలనీ అధ్యక్షుడిగా రవీంద్రరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం వెంకటరాయనగర్ కాలనీ పార్కులో అడ్వైజరి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో రవీంద్రరెడ్డి, సుబ్బారావు ప్యానల్లు పోటీ పడ్డాయి. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 227 ఓట్లు పోల్ కాగా రవీంద్రరెడ్డికి 210 ఓట్లు, సుబ్బారావుకు 10 ఓట్లు వచ్చాయి. దీంతో 200 ఓట్ల మెజార్టీతో రవీంద్రరెడ్డి కాలనీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

జిల్లా ట్రస్మా ఎన్నికలు

ఆల్విన్‌కాలనీ: ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి పర్యవేక్షణలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ట్రస్మా ఎన్నికలు చైతన్య విద్యానికేతన్ హైస్కూలులో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా పద్మశ్రీ హైస్కూల్ కరస్పాండెంట్ జేరిపోతుల నాగరాజు, వాసర విద్యాలయం హైస్కూల్ కరస్పాండెంట్ గుంజడి అశోక్ ప్రధాన కార్యదర్శిగా, విద్యాకిరణ్ మోడల్ స్కూల్ కందునూరి పరశురామ్‌గౌడ్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ట్రస్మా స్టేట్ చీఫ్ అడ్వయిజర్ యాదగిరి శేఖర్‌రావు, అబ్జర్వర్‌గా ఇన్నారెడ్డి వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 268 మంది పాఠశాలల కరస్పాండెంట్‌లు, అన్ని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు పాల్గొన్నారు.

వ్యాపారాలకు అడ్డాగా కల్వర్ట్ ప్రాంతం


చింతల్ మార్కెట్‌లోని కల్వర్ట్‌కు ఇరువైపుల కొనసాగుతున్న వ్యాపారాలు

రంగారెడ్డినగర్: లక్షలాది నిధులు వెచ్చించి వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా విస్తరించి కల్వర్ట్ ప్రాంతం అక్రమ వ్యాపారాలకు అడ్డాగా మారింది. చింతల్ మార్కెట్ సమీపంలో గతంలో నాలాపై ఉన్న కల్వర్ట్ మార్గం చిన్నదిగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ నిధులతో కల్వర్ట్‌ను విస్తరించారు. అయితే కల్వర్ట్‌పైనే కొందరు తోపుడు బండ్లు, డబ్బాలను ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం రద్దీ వేళ్లలో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఇప్పటికైనా కల్వర్ట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అక్రమ వ్యాపారాలను తొలగించి రాకపోకలు సజావుగా కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేది లేదు


ఎమ్మెల్యే వివేకానందకు మెమోంటోను అందజేస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేది లేదని.. గత పదేళ్లుగా చేసిన అభివృద్ధే తనను గెలిపించిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు సంక్షేమ సంఘాల నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని వివేకానంద హామీ ఇచ్చారు.



సీఎం ప్రకటనపై ఆర్టీసీ కార్మికుల హర్షం


జీడిమెట్ల డిపో వద్ద ఐఎన్‌టీయూసీ నాయకులు

జీడిమెట్ల: టీఎస్‌ఆర్టీసీ కార్మికుల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి 21శాతం ఫిట్మెంట్ ప్రకటించిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్‌ల ఫొటోలకు ఆదివారం జీడిమెట్ల డిపో వద్ద పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డిపో కార్మికులు మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నేషనల్ ప్రెసిడెంట్ అంబాటి కృష్ణమూర్తి, గుంజా శ్రీనివాస్, చెరుకూరి గురుప్రసాద్, గంధం నారాయణరెడ్డి, సంపత్‌రెడ్డి యాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు'

నిజాంపేట్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధిలో కీలకంగా మారారని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిజాంపేట్ సప్తపది ఫంక్షన్‌హాల్‌లో చలసాని భారతి, ఆదర్శ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధన్‌రాజ్ యాదవ్, నిజాంపేట్ 7వ డివిజన్ కార్పొరేటర్ ప్రణయయాదవ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వైద్య, విద్య రంగం, ప్రభుత్వ ఉద్యోగినులుగా, శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గురుడు శ్రీలత, సుజాతరెడ్డి, వాణి, రాజేశ్వరి, నాగలక్ష్మి, నళిని అడుసుమిల్లి, మాధవి, పద్మ, శిరీష, శోభ, సరళ, కుమారి,రేఖ రాజు తదితరులు పాల్గొన్నారు.


మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

మర్యాదపూర్వక కలయిక


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను ఆహ్వానిస్తున్న శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ మెట్కాన్‌గూడకు చెందిన శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 13న జరిగే ఆలయ పునర్ నిర్మాణం, అన్నదాన సత్ర నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ ఆలయాలు ఆధ్యాత్మిక చింతనకు నిలయాలని, ఆలయాభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు.